క్లుప్తంగా

మున్సిపల్ ఉద్యోగులకు ఇంటి స్థలాల మంజూరుకు కృషి

కడప కార్పొరేషన్ : మున్సిపల్ ఉద్యోగులకు ఇంటి స్థలాలు మంజూరు చేయించేందుకు కలెక్టర్‌తో మాట్లాడుతానని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఇంటి స్థలాల ప్రస్తావన తీసుకురాగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇంటి స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు షకీల్ అహ్మద్, జనరల్ సెక్రటరీ రవిబాబు, కోశాధికారి లూకరాజు, విశ్వనాథరెడ్డి, జి. శివకుమార్, కె. శ్రీరాములు, రెవెన్యూ ఆఫీసర్ విజయ భాస్కర్ గౌడ్, మేనేజర్ హిదాయతుల్లా, ఖాజా మోహిద్దీన్, విష్ణువర్ధన్, హర్షవర్ధన్, క్రిష్ణయ్య, శోభన్ బాబు, శివ పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌లో నైపుణ్యం పెంపొందించుకోవాలి

కడప రూరల్ : సైన్స్ పట్ల విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక నకాష్‌వీధిలోని దుబాయ్ ఇంటర్నేషనల్ హైస్కూలులో సైన్స్ ఫెయిర్-2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి టెక్నాలజీ, సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశ ప్రగతిని దోహదపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిద్దాం

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ కోరారు. గురువారం ఆయన ఆ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూ జీకేవై పథకం ద్వారా సి-డ్యాప్ సౌజన్యంతో కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల పాటు ఉచిత కంప్యూటర్, హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణతోపాటు కంప్యూటర్ బేసిక్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కడపలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్ (7013665112, 9059160549)లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఆలయ వార్షికోత్సవ వేడుకలు

కమలాపురం : మండల పరిధిలోని సి.గోపులాపురంలో వెలసిన పట్టాభి రామచంద్ర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు గణపతి పూజతో మొదలై స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తామన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పాలపళ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో గెలుపొందిన విజేతలకు రూ.25వేలు, రూ.20,016, రూ.15వేలు, రూ.10,116, రూ.5,016 నగదు బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు 63039 82843, 98669 28951 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

రేపు ఏపీ జేఏసీ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 4న కడపలోని వైఎస్సార్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్.జీవన్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్, కోశాధికారి కేపీ రొనాల్డ్ శ్యాముల్‌రాజ్ తెలిపారు. ఈ సమావేశానికి అమరావతి ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరు కానున్నారని పేర్కొన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరు కావాలని వారు కోరారు.

హైస్కూల్ తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాలకు సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పది ఫలితాల్లో విద్యార్థులు కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

విశ్వ వేదికపైకి మనోళ్లు


శిల్పకళా విభాగంలో స్వర్ణం సాధించిన శిల్పం


నిర్వాహకుల నుంచి మెడల్స్ సర్టిఫికెట్లు అందుకుంటున్న వైవీయూ విద్యార్థులు

- అంతర్జాతీయ యువజనోత్సవాలకు వైవీయూ విద్యార్థులు
- జాతీయ యువజనోత్సవాల్లో ముగ్గురికి పతకాలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఖ్యాతిని జాతీయస్థాయి వేదికగా ఎగురవేశారు. కర్నాటక రాష్ట్రంలోని జైన్ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన 36వ అంతర్ విశ్వవిద్యాలయాల జాతీయస్థాయి యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు సత్తాచాటి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో గుజరాత్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశాన్ని విశ్వవిద్యాలయ విద్యార్థులు దక్కించుకున్నారు. రెండు స్వర్ణ పతకాలు, ఒక కాంస్యపతకం సాధించి విశ్వవిద్యాలయ ఖ్యాతిని చాటిచెప్పారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ రాణించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

‘శ్రమశక్తి’కి స్వర్ణం..



శిల్పకళా విభాగంలో నిర్వాహకులు ‘శ్రమశక్తి’ అన్న అంశంపై టాపిక్ ఇచ్చి అందుబాటులో ఉన్న సామగ్రితో శిల్పాన్ని తయారు చేయమని సూచించారు. విశ్వవిద్యాలయంలో రెగ్యులర్‌గా సాధన చేస్తూ ఉన్న అనుభవం అక్కడ ఉపయోగపడింది. దీంతో ఉన్న మెటీరియల్‌తో శ్రమశక్తిపై శిల్పాన్ని తీర్చిదిద్దాను. దీనికి ప్రథమ బహుమతి లభించడంతో పాటు స్వర్ణపతకం అందుకోవడం సంతోషంగా ఉంది. అంతర్జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాను.

- బి. గంపమల్లయ్య, బీఎఫ్ఏ ఫైనలియర్, వైవీయూ

‘ప్రకృతి’కి పతకం..



ఫొటోగ్రఫీ విభాగంలో ఇచ్చిన సమయంలోపు ఉత్తమ ఫొటోలు తీసే అంశంపై నిర్వహించిన పోటీలో పాల్గొన్నాను. ప్రకృతిపై తీసిన ఫొటోలు, శ్రమసౌందర్యాన్ని చాటిచెప్పే ఫొటోలను తీయడంతో ఫొటోగ్రఫీ విభాగంలో ప్రథమస్థానం లభించింది. తద్వారా నిర్వాహకుల నుంచి స్వర్ణపతకాన్ని అందుకున్నాను. అంతర్జాతీయస్థాయి పోటీల్లో సైతం పతకం సాధించాలన్న లక్ష్యంతో సిద్ధమవుతున్నా.

- బి. పవన్‌కల్యాణ్, బీఎఫ్ఏ ఫైనలియర్, వైవీయూ

‘కార్టూన్’లో కాంస్యం..



జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో కార్టూన్ విభాగంలో పోటీపడ్డాను. ‘క్రీడారంగం -మాదక ద్రవ్యాల ప్రభావం’ అన్న అంశంపై ఇచ్చిన పోటీలో నేను గీచిన కార్టూన్ మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం కైవసం చేసుకున్నాను. త్వరలో నిర్వహించే అంతర్జాతీయస్థాయి యువజనోత్సవాల్లో మెరుగైన ప్రదర్శనకు కృషిచేస్తా.

- వై. అరవింద్, బీఎఫ్ఏ ప్రథమ సంవత్సరం, వైవీయూ

బాల్య వివాహాలను అరికట్టాలి


బాల్య వివాహాలు చేయరాదని మహిళలకు అవగాహన కల్పిస్తున్న కెతుర

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సోషియల్ అండ్ బిహేవియర్ ఛేంజ్ కమ్యూనికేషన్ (ఎస్‌బీసీసీ) వైఎస్సార్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కెతుర తెలిపారు. గురువారం నగర శివార్లలోని న్యూ యానాది కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఈ కార్యక్రమానికి పాల్పడితే తల్లిదండ్రులతోపాటు వివాహం చేసే పురోహితులు, పాస్టర్లపైన కూడా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. బాలికలు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలన్నారు. చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సఖి ఫౌండేషన్‌ప్రతినిధి రహమతున్నీసా, సాయిపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాజీరాబి, మహిళా పోలీసు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


పాదచారులకు జ్యూస్ అందజేస్తున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య

కమలాపురం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో అభి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన మజ్జిగ, జ్యూస్‌లను ఆయన పాదచారులకు అందజేసి మాట్లాడారు. ఆసుపత్రి, వివిధ ప్రభుత్వ కార్యాలయాలున్న చోట చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వేసవి కాలం ముగిసే వరకు జన సంచారం అధికంగా ఉన్న చోట దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి రోజు చలివేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి మంచినీటిని అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నాగేశం విజయ్‌బాబు, సభ్యులు ముదిరాజ్ రాము, లక్ష్మణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


వైవీయూలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పి. నాగరాజులను గెలిపించాలంటూ ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకుల ప్రచారం నిర్వహించారు. గురువారం విశ్వవిద్యాలయంలో పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. దస్తగిరి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటా దుర్గాభవానికి మొల్లమాంబ పురస్కారం



కడప కల్చరల్ : ప్రొద్దుటూరుకు చెందిన కవయిత్రి కోటా దుర్గా భవానీకి మహా కవయిత్రి మొల్లమాంబ సాహిత్య పురస్కారం ఇవ్వనున్నట్లు మొల్ల సాహిత్య పీఠం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో జరగనున్న సభలో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి, పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం తదితరులు హాజరవుతారన్నారు. మొల్లమ్మ పురస్కారంగా ఆమెకు నగదుతో పాటు జ్ఞాపిక అందించి సత్కరించనున్నట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వల్లూరు : నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 5 మందికి కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం 5 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువ చేసే చెక్కులను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్య శాలల్లో చికిత్స పొందడానికి అవకాశం కల్పిస్తూ వ్యాధుల సంఖ్యను గణనీయంగా పెంచారన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వర్తించని జబ్బులకు సంబంధించి చికిత్సలు పొందిన బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల వైఎస్ఆర్‌సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉగాదిలోపు పక్కాగృహాలు పూర్తి కావాలి


మాట్లాడుతున్న పెద్దిరాజు

బద్వేలు : జగనన్న పక్కాగృహాల నిర్మాణాలను ఉగాదిలోపు పూర్తయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెద్దిరాజు తెలిపారు. గురువారం పోరుమామిళ్ల పట్టణంలోని స్త్రీశక్తిభవన్‌లో పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండలాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు బిల్లులను అప్‌లోడ్ చేస్తూ లబ్ధిదారులకు సహకారం అందించాలన్నారు. ప్రతి పంచాయతీ వారీగా లేఅవుట్ వారీగా జిల్లా కలెక్టర్ విజయరామరాజు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం లేఅవుట్‌లో సకల సౌకర్యాలు కల్పిస్తుందని, లోటుపాట్లు ఉంటే వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పంచాయతీల వారీగా గత వారం నిర్దేశించిన లక్ష్యాలు, చేరుకున్న లక్ష్యాలను అడిగి తెలుసుకుని ఈ వారం లక్ష్యాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో వారికి దిశానిర్దేశం చేశారు. పోరుమామిళ్ల ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీఓలు నూర్జహాన్, ముజఫర్‌రహీమ్, చంద్రమౌళీశ్వర్ పాల్గొన్నారు.

బంజారాల సంస్కృతి గొప్పది

బంజారా హోలి పోస్టర్లను ఆవిష్కరించిన మేయర్ సురేష్‌బాబు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు, బంజారా సంఘం నాయకులు

కడప రూరల్ : బంజారాల సంస్కృతి ఎంతో గొప్పదని కడప నగర మేయర్ సురేష్‌బాబు అన్నారు. ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న స్థానిక గిరిజన భవన్‌లో బంజారా హోలీ కార్యక్రమం జరిగింది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోలీ పండుగను సాంప్రదాయ పద్ధతిలో జరుపుకుంటారని తెలిపారు. ఆరోజు బంజారాలంతా ఏకమై సంతోషంతో గడుపుతారన్నారు. ఇటువంటి పండుగలను జయప్రదం చేయాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఐ.శివానాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయక్, బంజారా సంఘం నాయకులు జగన్నాయక్, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపు దారుణం


జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని జ్యోతిరావ్ పూలే సర్కిల్ వద్ద వంట గ్యాస్ ధరలను పెంపును నిరసిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వరుసగా వంట గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతూ ప్రజలపై భారాలను మోపడం తగదన్నారు. 2014లో రూ.410 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ప్రస్తుతం రూ.1155లకు చేరిందన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినా మన దేశంలో ఎందుకు ధరలు పెంచుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ధరల పెంపు సరికాదు

కడప రూరల్ : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరల పెంపుదలను రద్దు చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సగిలి గుర్రప్ప తెలిపారు. గురువారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ల ధరల పెంపు సామాన్యులపై పెను ప్రభావం చూపనుందని వాపోయారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ధరలను తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మద్దతు

కడప ఎడ్యుకేషన్: పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు ప్రొగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్, రెవల్యూషన్ యూత్ ఫ్రంట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున బలపరుస్తున్నట్లు పీఎస్‌యూ, ఆర్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు సుబ్బరాయుడు, కళ్యాణ్ తెలిపారు. గురువారం నగరంలోని వారి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆయన గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు చెన్నయ్య, గోపి, ఆర్‌వైఎఫ్ నాయకులు నరసింహారావు, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లె ఆలయ వేద పండితుడికి అరుదైన ఆహ్వానం

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన వేదపండితుడు వేణుతుర్ల నరేంద్ర శర్మకు సర్ సీ.వీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రుద్రాక్ష వైభవ ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది మహోత్సవ సంబరాలకు హాజరుకావాలని ఆహ్వానం పంపారు. 8 రాష్ట్రాలకు చెందిన నిష్ణాతులకు మార్చి 5న తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాదులోని హరిహర కళాభవనంలో సన్మానం నిర్వహించనున్నారు. ఆయనకు సువర్ణ కంకణం, సామవేద శిఖామణి బిరుదు సత్కరించనున్నారు.

ముస్తాబవుతున్న పార్కు




చురుగ్గా సాగుతున్న పార్కు పనులు

కడప కార్పొరేషన్ : కడప- రాయచోటి మార్గంలో చెమ్ముమియ్యా పేట వద్ద ఏర్పాటు చేసిన రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద అందమైన పార్కు ముస్తాబవుతోంది. బ్రిడ్జి కింద ఉన్న స్థలాన్ని వృథాగా వదిలేసి ఆక్రమణలు, అక్రమాలకు అలవాలం కాకుండా కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా పార్కు నిర్మిస్తున్నారు. అర ఎకరా విస్తీర్ణంలో ఇప్పటికే పార్కు చుట్టూ, మధ్యలో పాత్ వే , ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, ఫౌంటేన్, వాష్ రూమ్స్ నిర్మించి, చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. పిల్లర్లకు పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన బొమ్మలు వేస్తున్నారు. మిగతా ప్రాంతంలో మొక్కలు నాటి, పచ్చదనం పెంపొందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం నేషనల్ క్లియర్ ఎయిర్ నిధుల నుంచి రూ.58లక్షలు, స్వచ్ఛ భారత్ నిధుల నుంచి రూ.15లక్షలు, పిల్లల ఆట పరికరాల కోసం రూ.10లక్షలు వినియోగిస్తున్నారు. ఒక మాసంలో పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక అధికారులు తెలిపారు.

నేటి నుంచి కోట పోలేరమ్మ తిరునాల

పోరుమామిళ్ల : పట్టణంలోని రంపాడురోడ్డులో వెలసిన కోట పోలేరమ్మ తిరునాల శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు వైభవంగా జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం పట్టణ ప్రజలు అమ్మవారికి చల్లన్నం తీసుకరావాలన్నారు. ఉదయం 7 గంటలకు కలశస్థాపన, పంచామృతాభిషేకం, పాలాభిషేక కార్యక్రమాలుంటాయన్నారు. శనివారం ఉదయం పోరుమామిళ్ల సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసువారి పూజాకార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, రాత్రి ఏకాంబర భజన జరుగుతుందన్నారు. ఆదివారం కుంకుమబండ్లు, గ్రామోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : వెల్లాలలోని డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023-24 సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియేట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.కృష్ణవేణి గురువారం తెలిపారు. అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థినులు ఈ నెల 24లోపు (ఏపీబీఆర్ఏజీఈ టీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం ఐదవ తరగతి విద్యార్థినులకు, మధ్యాహ్నం ఇంటర్మీడియేట్ విద్యార్థినులకు ఉంటుందని వివరించారు. వివరాలకు 97045 50133, 81797 95996 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమాజంలో లింగ వివక్ష ఉండకూడదు


చాపాడు: లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : సమాజంలో ఏ ఒక్కరూ లింగ వివక్ష చూపరాదని హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి పేర్కొన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆడ మగ అనే భేదం చూపకుండా తల్లిదండ్రులు పిల్లలను పోషించాలన్నారు. లింగ వివక్ష కారణం తోనే భ్రూణ హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం లింగ వివక్షపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాముడు, కస్తూర్బా గాంధీ ఎస్‌ఓ నాగలక్ష్మి, ఏఎన్ఎంలు రెబాకా, స్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీ ఉషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

దువ్వూరు : చిన్న వయసులోనే ఆడ పిల్లలకు పెళ్లి చేయడం చట్ట విరుద్ధమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం బేటి పడావో - బేటి బచావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆడ పిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లల విషయంలో భేదాలు చూపకూడదన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. భ్రూణ హత్యలను నివారించాలని తెలిపారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మల్లేశ్వరి, ఏఎన్ఎం మాధవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

బి.కోడూరు : ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అని మండల వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. గురువారం మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గర్భస్థ పిండ పరీక్షలు చేసే ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, జన్యు చికిత్స కేంద్రాలు గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ నియంత్రణ మండలి మరియు దుర్వినియోగ నివారణ చట్టం-1994 చట్ట ప్రకారం నమోదై ఉండాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే మొదటి తప్పుకు 3 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా, అదే తప్పు రెండవసారి చేస్తే 5 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.